# పయనమెచటికోయీ

పారిస్ ఛార్ల్స్ డిగాల్ ఎయిర్‌పోర్టులో, డల్లాస్ వెళ్ళే నా ఫ్లైట్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. అక్కడ న్యూస్ స్టాండ్‌లో అంతకు ముందు రోజు యు ఎస్ ఎ. టు డే న్యూస్ పేపర్ కొనుక్కుని, ఆ రెండు వారాలూ మిస్ అయిన స్టాక్ మార్కెట్ వివరాలు చదువుతూ కూర్చున్నాను

పారిస్ ఎయిర్‌పోర్టు చాల బిజీగా వుంది. ఎన్నో దేశాలనించి, రకరకాల బట్టలతో రకరకాల మనుష్యులు, ఆడా మగా, పిల్లా పాపా, ఒకటే హడావిడిగా అటూఇటూ తిరిగేస్తున్నారు. చైనీస్ జపనీస్ ఫ్రెంచ్ జర్మన్ అరబిక్ హీబ్రూలాటి కొన్నిటిని గుర్తించటం సులభమే కాని, ఎన్నడూ వినని భాషలు కూడా వినిపిస్తున్నాయి. మధ్యమధ్యలో హిందీ గుజరాతీలు సరేసరి. ఆరోజు తమిళ్ తెలుగువాళ్ళు కూడా వున్నట్టున్నారక్కడ.

చదువుతున్న న్యూస్ పేపర్లో కూడా దానికి సంబంధించినదే ఒక వార్త. అమెరికా వచ్చే ఇమ్మిగ్రెంట్సులో, మెక్సికోలాటి మధ్య, దక్షిణ అమెరికాల నించి వచ్చే వారి తర్వాత, ఎక్కువగా వస్తున్నది ఏషియానించి అని. దానిలో కూడా చైనా, ఇండియా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేష్, మలైషియా, కొరియా మొదలైన దేశాలనించీ ఎంతమంది వస్తున్నారో వుంది.

ఇందాక న్యూస్ స్టాండ్ దగ్గర పుస్తకాలు అమ్ముతున్న అమ్మాయి అలంకరణ మనవి కాకపోయినా చూడటానికి ఇండియన్‌లాగానే వుంది. ఫ్రెంచ్‌లోనే అనర్గళంగా మాట్లాడుతున్నది.

ఇండియన్‌వా అని అడిగితే "నా పేరెంట్సు ఇండియన్స్, నేను ఇండియన్‌ని కాదు. ఫ్రెంచ్" అని చెప్పింది. ఫ్రాన్స్‌లో రెండవతరం ఇండియన్ అమ్మాయి అన్న మాట.

ఎప్పుడో చిన్నప్పుడు ఇండియా వెళ్ళిందిటకానీ ఇండియా గురించి అంతకన్నా ఏమీ తెలీదని చెప్పింది. నాకు కొంచెం దూరంగా కూర్చున్న ఆవిడ తన ఇద్దరు పిల్లలతో తెలుగులో మాట్లాడుతున్నది. వాళ్ళు అమెరికన్ ఇంగ్లీషులో జవాబిస్తున్నారు ఇంకొక ఇరవై ఏళ్ళు పోతే ఈవిడ పిల్లలుకూడా ఇవాళ ఈ న్యూస్ పేపర్ అమ్మాయి నాకు చెప్పిన సమాధానమే చెబుతారు కావును.

ఈ సంఘటన చూడగానే నాలో ఎన్నో ఆలోచనలు మొదలయ్యాయి. అసలు జనం ఒక చోటునించీ, ఇంకో చోటుకి ఎందుకు వలస వెడతారు అన్న ప్రశ్నకి జవాబు చెప్పటం చాల సులభమే. పూర్వంనించీ అంటే రాతియుగంనించీ జరుగుతున్నదదే. ఒకచోట వానలు పడక పళ్ళూఫలాలు పండకపోతే, అవున్న చోటుకి వలస వెళ్ళేవాడు మనిషి. మనుష్యులే కాదు, జంతువుల్ని పరిశీలించినా, పక్షుల్ని చూసినా అదొక ప్రకృతి సూత్రంలా కనిపిస్తుంది కొన్ని పక్షులు ఎండాకాలంలో చలికాలంలో కొన్ని వేల మైళ్ళు అలా ఎగురుకుంటూ వెడతాయని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్య

పోతాం మనం. ఈ రోజు గుంటూరులో ఉద్యోగం చేసుకునే అతను, అంతకన్నా మంచి ఉద్యోగం బెంగుళూరులో వస్తే వెళతాడు. బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న ఒకాయనకి ఆస్ట్రేలియాలో అవకాశం వస్తే వెళతాడు. తిరుపతిలో పి.హెచ్ డి. చేసిన ఆవిడ పోస్ట్ డాక్‌గా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి వెడుతుంది. స్పేస్ రీసెర్చిలో ఇండియాలోని ఒక సైంటిస్ట్ అమెరికా వెళతాడు. అంటే మంచి అవకాశాలు ఒక కారణంలాగా కనిపిస్తున్నాయి ఆ మంచి అవకాశమన్నది డబ్బు రూపేణా కావచ్చు, శాస్త్రీయ విజ్ఞాన శోధనకే కావచ్చు, ఇక దేనికైనా కావచ్చు.

బంగ్లాదేశ్‌నించి వాళ్ళు ఇండియాకి వలస వస్తుంటే, ఇండియానించీ మన వాళ్ళు వేరే దేశాలకి వెడుతున్నారు. ఇదిలా జరుగుతూనే వుంటుంది.

అలాగే ఇండియానించీ కొన్ని తరాల క్రితం వలసవెళ్ళిన వారి వంశీయులు ఇండియాని మరచిపోవటంలో ఆశ్చర్యంలేదు. వారూ నివాసదేశంలో భాగమయి పోవటం చూస్తున్న విషయమే. ఒకసారి ఇంగ్లండ్‌లో మిల్లీనియమ్ వీల్ దగ్గర ఒక ఇండియన్ ఆరిజిన్ కుటుంబాన్ని కలిశాను. వాళ్ళు కెన్యానించి వచ్చారు. నాలుగైదు తరాల క్రితం ఇండియానించి కెన్యా వెళ్ళి, అక్కడే సెటిల్ అయిపోయినవాళ్ళు. వాళ్ళల్లో ఒక ముసలాయన చెప్పాడు ఇండియాలో వాళ్ళ తాతలు ఏ ప్రాంతంనించి వలస వచ్చారో. ఆ ప్రాంతానికి ఇప్పుడు ఆ పేరు కూడాలేదు. వాళ్ళకి ఇండియాతో ఈ రోజు ఏ సంబంధమూలేదు. అలాగే మహాత్మాగాంధీ మనవరాలు శ్రీమతి ఈలా గాంధీ, దక్షిణాఫ్రికాలో గవర్నమెంట్‌లో మంత్రి. గాంధీగారు 21 సంవత్సరాలు సౌత్ ఆఫ్రికాలో వున్న తర్వాత, అక్కడినించీ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటానికి ఇండియా వెళ్ళిపోతే, ఆయన కొడుకు అక్కడే వుండిపోయాడు. ఆయన సంతానమే ఈవిడ. అలాగే ఫిజీ మాజీ ప్రెసిడెంట్ మహేంద్ర చౌదరి ఆ దేశం వాడే ప్రముఖ గాల్ఫ్ ఆటగాడు విజయ్ సింగ్. వెస్టిండీస్ క్రికెట్ ప్లేయర్లు కన్హాయ్, కాళీచరణ్, అలాగే ఇంగ్లండ్ రామన్ సుబ్బారావ్, సింగపూర్ ప్రధాని నాథన్‌లాంటి ప్రముఖులు మనవాళ్ళుకాని మనవాళ్ళు.

అప్పుడే ఇంకొక అరగంటలో బోర్డింగ్ మొదలు పెడతామని ఎనౌన్స్ చేస్తున్నది ఎయిర్ ఫ్రాన్స్ ఆవిడ. నా ఆలోచనలింకా ఈ విషయందాటి బయటికిపోవటం లేదు. ఇండియాలో జనాభా ఎక్కువయిపోతున్నది. జనాభాలో ప్రస్తుతం రెండవ స్థానంలో వున్నాం. ఇంకో ఎనిమిదేళ్ళలో మొదటి స్థానానికి వెడుతున్నాం. ప్రథమ స్థానంలో వున్న చైనాకన్నా మనదేశం విస్తీర్ణంలో చిన్నది. ఆర్థికంగా చైనాకన్నా వెనకనే వున్నాం మనం. నేను చైనాతో పోల్చింది ఒక ఉదాహరణగా మాత్రమే.

అదీకాక కులాల పేరుతో రిజర్వేషన్లతో, లంచాలలో సమర్థులైనవారికి ఇండియాలో అవకాశాలు తగ్గిపోతున్నాయి. బాగా చదువుకుని, ఎన్నో చేయాలనుకున్న కొంతమంది ఉత్సాహవంతులకి, పై కారణాలవల్ల ఎంతో నిరాశా, నిస్పృహ ఎదురవుతున్నాయి. ఇవన్నీ కొన్ని కారణాలయితే, ఆశ, గ్రీడీనెస్, పొరుగింటి పుల్లకూర, అతిశయం, ఆర్భాటం, మొదలైనవీ వలస యాత్రలకింకా కొన్ని కారణాలు అవటానికి వీలుంది. సంపన్నమైన దేశాల్లో మనవాళ్ళు వుంటే వాళ్ళకి కావలసిన వాళ్ళల్లో ముఖ్యుల్ని కూడా ఆ దేశాలకి తీసుకువెళ్ళటం సహజం. ఇలా విదేశాల

కి వలస వెళ్ళేవారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతున్నది.

మరి ఇలా మనవాళ్ళంతా బాగా చదువుకునవాళ్ళు ఇలా విదేశాలకు వెళ్ళిపోతుంటే భారతదేశం ఏమవుతుంది అన్నది ప్రశ్న. అంటే బ్రెయిన్ డ్రెయిన్ అన్నమాట. దీని గురించి కొందరు పెద్దలు ఎప్పుడు గాభరా పడింది. మరి కొందరు పెద్దలు ఈ బ్రెయిన్ డ్రెయిన్ వల్ల ఇండియాకి ఏమీ ప్రమాదం లేదని నిర్ధారించారు. ఈ వారణకు మూలకారణాలు ఆలోచిస్తే, ఇంతాక మనం అనుకున్నాము, ఈ పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న నిరుద్యోగం అని ఇట్టే అర్థమైపోతుంది. వెళ్ళేవాళ్ళని వెళ్ళనిస్తే మిగిలినవాళ్ళకి అవకాశాలు పెరుగుతాయని, అలా బయటి దేశాలకు వెళ్ళేవారి వల్ల, విదేశీ మారక ద్రవ్యం కొత్త పెట్టుబడులు ఇండియాకి వస్తాయనే భావన కూడా కావచ్చు. చాలమంది సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఇండియానించి అమెరికా యూరప్ ఆసియా దేశాలకు పెద్దసంఖ్యలో వలసవెళ్ళటం ఈరోజుల్లో మనం చూస్తున్నాం. వీళ్ళల్లో చాలమంది విదేశాల్లో ఐదారేళ్ళుండి కాసిని సొమ్ములు వెనకేసుకుని ఇండియాకి తిరిగివద్దామని వెళ్ళిన వాళ్ళే. కాని ఆ కాసిని సొమ్ములు వెనకేసుకుని ఎంతమంది తిరిగివస్తున్నారు? అంటే దానికి జవాబు పెద్ద ఆశాజనకంగా వుండదు. అలా ఎందుకు జరుగుతున్నది అన్న ప్రశ్నకి ఎన్నారై కబుర్లలో 48 అనే ఎపిసోడ్ లో మనం చెప్పుకున్నాం.

పశ్చిమ దేశాలెప్పుడూ భౌతిక సుఖాల కోసమే వెతుకుతుంటాయని, మన దేశం ఆధ్యాత్మిక దేశం కావటంవల్ల జీవన విధానంలో ఆ దేశాలకన్నా మనం మిన్న అని అలాంటి దేశాలకి మన దేశం ఆదర్శంగా నిలుస్తున్నదని మనం వింటున్నాం. చదువుతున్నాం. అనుకుంటున్నాం. మరి అలాంటిది మనవాళ్ళు పశ్చిమ దేశాలవారితో సమానంగానో, వారిని మించో, ఇవాళ ఎందుకీ భౌతిక సుఖాల కోసం పాకులాడుతున్నారనేది ఇంకొక ప్రశ్న. ఈ ప్రశ్న ఇండియాని వదిలి విదేశాలకువెళ్ళే వాళ్ళకు ఎంత వర్తిస్తుందో, ఇండియాలోనే వుండి న్యాయంగానే కాక అవినీతి మార్గాలలో కూడా ధన సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్న కోట్లాది ప్రజలకు కూడా వర్తిస్తుంది.

అప్పుడే మా ప్లేన్‌లో బోర్డింగ్ మొదలయ్యింది. సీట్ల నెంబర్ల ప్రకారం పిలుస్తున్నారు. నా ముందర కొంతమంది, వెనక కొంతమంది భారతీయులు నుంచుని వున్నారు లైన్లో. ఎన్నోదేశాలవాళ్ళు మా లైన్లోనూ, ఎయిర్ పోర్ట్‌లోనూ కనిపిస్తూనే వున్నారు. అంటే ఈ పయనం నాకొక్కడికీ, మనవాళ్ళకి మాత్రమే కాదు.....

అందరికీనూ. ప్రపంచంలో అందరికీనూ.

ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే ఈ పయనానికి అర్థం అర్థమవుతున్నట్టుంది.

మనిషి ఒక చోటు నించీ ఇంకొక చోటుకి వెడుతుంటాడు.

వెళ్ళే ముందర వెళ్ళబోయే చోట ఏముందో తెలుసుకునే మరీ వెడతాడు.

అలా చేసే ప్రయాణాలు చివరికి ఒకచోట ఆగిపోక తప్పదు.

ఆ చివరి ప్రయాణం ఎక్కడికో తెలుసుకోవటానికి మరి ప్రయత్నం ఎప్పుడు చేస్తున్నాడు?

*   *   *